# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 95 ప్రకాశం, సోమవారం 05- 01 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## అమ్మనబ్రోలులో జూదంపై పోలీసుల మెరుపుదాడి



క్రైమ్ కౌంటర్ న్యూస్...ప్రకాశం జిల్లా.... ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మనబ్రోలు ఎస్సీ కాలనీలో జూదం ఆడుతున్న ఐదుగురిపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి, వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 15,140 నగదు, 4 సెల్ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, ప్రజలు జూదం వంటి వాటికి దూరంగా ఉండాలని, అనుమానాస్పద సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. అరెస్ట్ అయిన వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు...

## లిఫ్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం




ఒంగోలు క్రైంకౌంటర్ ప్రతినిధి,నగరంలోని ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రిఆనం రామనారాయణ రెడ్డి , సాంఘిక సంక్షమ శాఖ మంత్రి,డోలా బాల వీరాంజనేయ స్వామి , ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి , ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ , గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి , సంతనూతలపాడు శాసనసభ్యులు విజయ్ కుమార్ , టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ , శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్ , దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మ ,యర్రగొండపాలెం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్సన్ బాబు , పలువురు అధికారులు పాల్గొన్నారు.

## చిన్నరామాపురంలో జల్లికట్టు



చంద్రగిరి, జనవరి 4: చంద్రగిరి మండలం చిన్నరామాపురంలో ఆదివారం జల్లికట్టు (పశువుల పండగ) జరిగింది. పశువుల పండుగ(జల్లికట్టు) అట్టహాసంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచీ పశువులను చిన్నరామాపురం తీసుకొచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడెగిత్తలు, ఆవులు, దూడలకు కొమ్ములు చెలిగి, రంగులేసి సినీనటులు, దేవుళ్లు, నేతల ఫొటోలను, చెక్క పలకలతో పాటు, నగదు, వస్తు సామగ్రిని కట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో నడివీధిలో పశువులను అల్లెలోకి వదిలారు. వీటిని నిలువరించి బహుమతులు సొంతం చేసుకునేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో వీరి మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువులను నిలువరించే క్రమంలో కిందపడటంతో పలువురికి గాయాలయ్యాయి.

## ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

క్రైం కౌంటర్ ప్రతినిధి టి.నాగ బ్రహ్మం కందుకూరు రూరల్, ఎం ఎల్ ఏ ఇంటూరి నాగేశ్వరరావు చిన్న కుమారుడు సందీప్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. పెదకాకాని శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు కంటి పరీక్షలనునిర్వహించి ఉచితంగా మందులను అంద జేశారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి పెదకాకాని తీసుకువెళ్లి ఆపరేషన్లు చేసే విధంగా ఏర్పాట్లను చేశారు. ఈ నేత్రవైద్య శిబిరానికి కందుకూరు నియోజవర్గంలోని అనేక గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.తొలుత సందీప్ పుట్టినరోజును పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేకును సందీప్ కట్ చేశారు. వివిధ వర్గాల ప్రజలు, నాయకులు, ప్రజలు సందీప్ కు పుట్టినరోజుశుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ఇంటూరి రిబ్బన్ కట్ చేసి నేత్ర వైద్య శిబిరాన్నిప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు పి.సౌమ్య స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ స్కందపురి బ్రాహ్మణ సేవా నూతన పాలక వర్గం



క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,శ్రీ స్కందపురి బ్రాహ్మణ సేవా సమితి పాలక వర్గం ఎన్నికలు బ్రాహ్మణ సత్రంలో ఆదివారశీ జరిగాయి.నూతన కార్యవర్గం ను ఏకగ్రీవంగా ఎన్నికయింది. అధ్యక్షులు గా రావులకొల్లు. వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీగా పిన్నంరాజు ప్రభాకర్, కోశాదికారి గా పచ్చవ శివ కృష్ణ నియమించారు. 6గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నుకొన్నారు.

## ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి! ఆర్టీసీ ఆర్ఎం జి .సత్యనారాయణ

క్రైంకౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, బస్సు స్టేషన్ లలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఒంగోలు ఆర్టీసీ ఆర్ఎం జి. సత్యనారాయణ అన్నారు.డిపో గ్యారేజ్ , బస్ స్టేషన్ లను ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు.

బస్సుల నిర్వహణ,బస్ స్టేషన్ ను మెరుగుపరచడానికి విలువైన సూచనలను ఇచ్చారు. ఆయన వెంట డిఎం రాపూరి శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ శ్యామ్ ప్రసాదు, తదితరులు ఉన్నారు






గుడ్లూరు క్రైం కౌంటర్ ప్రతినిధి,మండలంలోని శాంతి నగరం వద్ద అదే గ్రామానికి చెందిన కొమరగిరి రామయ్య తండ్రి పేరు పోలయ్య 40 సంవత్సరాలు క్యాస్ట్ యానాది అను వ్యక్తి శాంతి నగరం విలేజ్ నుండి ఎస్టీ కాలనీకి వెళ్ళు నేషనల్ హైవేను కాలినడకన అవతల వైపుకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కావలి గవర్నమెంట్ హాస్పటల్ లో చికిత్స పొందుతూ మరణించగా అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ ఎస్ఐ తెలిపారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డులో కావలి కూచిపూడి చిన్నారులు ఉఅభినందించిన కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి




కావలి, కంచర్ల మల్లికార్జునరావు క్రైంకౌంటర్ ప్రతినిధి,శ్రీ మేధా నృత్య కళానిలయం విద్యార్థుల చారిత్రక విజయం భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో డిసెంబర్ 27న నిర్వహించిన భారీ కూచిపూడి నృత్య కార్యక్రమంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా, కావలి పట్టణానికి చెందిన శ్రీ మేధా నృత్య కళానిలయం నృత్య బృందం ప్రత్యేక గుర్తింపు పొందింది. ఈ నృత్య బృందానికి గురువుగా ఉన్న కోవూరు సరయు కృష్ణ నేతృత్వంలో 13 మంది చిన్నారులు ఈ గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొని రికార్డును కైవసం చేసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో వేలాది మంది బాలబాలికలు ఏకకాలంలో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చి ప్రపంచ రికార్డు నెలకొల్పగా, అందులో కావలి ప్రాంతానికి చెందిన చిన్నారుల భాగస్వామ్యం పట్టణ ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. సంప్రదాయ భారతీయ నృత్యకళను ప్రపంచ వేదికపై నిలబెట్టడంలో శ్రీ మేధా నృత్య కళానిలయం విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ చారిత్రక విజయాన్ని పురస్కరించుకొని కావలి ఎమ్మెల్యే నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువు సరయు కృష్ణతో పాటు గిన్నిస్ వరల్డ్ రికార్డులో పాల్గొన్న చిన్నారులను చిరు సత్కారంతో ఘనంగా అభినందించి ఆశీర్వదించారు. చిన్నారుల ప్రతిభను ప్రశంసిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“చిన్న వయసులోనే శాస్త్రీయ నృత్యకళలో ప్రావీణ్యం సాధించి గిన్నిస్ వరల్డ్ రికార్డు స్థాయిలో పాల్గొనడం అత్యంత గర్వకారణం. గురువు కోవూరు సరయు కృష్ణ గారి శిక్షణ, కృషి వల్లే ఈ పిల్లలు ఇంత గొప్ప విజయం సాధించారు. కావలి పేరు ప్రపంచ పటంలో నిలిచేలా చేసినందుకు వారందరికీ హృదయపూర్వక అభినందనలు” అని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలను కళల వైపు ప్రోత్సహించడమే కాకుండా, గురువులపై నమ్మకం ఉంచి అండగా నిలవడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.భవిష్యత్తులో కావలి ప్రాంతంలోని కళా ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.



క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా... నూతనంగా ఏర్పాటు కాబడిన మార్కాపురం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీన సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ.

మర్కాపురం జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి :జిల్లా ఇంచార్జి ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., మార్కాపురం జిల్లా కేంద్రంలోని నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఇంచార్జి జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, ఐపీఎస్., ఒక ప్రకటనలో తెలిపారు. మార్కాపురం జిల్లా పరిధిలోని మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, ఎర్రగొండపాలెం నియోజక వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ , ఒక ప్రకటనలో తెలిపారు...

## గుర్తు తెలియని వాహనం ఢీ జింక మృతి




**వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామం 167/బినేషనల్ హైవే దగ్గర రోడ్డు దాటు తున్నపుడు గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు సంవత్సరాల ఆడ పొడ దుప్పి (జింక ) తల దగ్గర తీవ్ర గాయం అయిశీది.ఫారెస్ట్ అధికారులు గార్డు హనుమంతరావు, సెక్షన్ అధికారి సురేషులు వి వి పాలెం సహాయ సంచాలకులు డా ఇ. చెన్నకేశవులుకు సమాచారంను తెలియజేశారు. ఆయన ఆదేశాల మేరకు పోకూరు పశు వైద్యులు డా యస్. సుధాకర్ పొడ దుప్పికి శవ పరీక్షనునిర్వహించారు.ఈ కార్యక్రమం లో మొబైల్ ఈ వెటరినరీ క్లినిక్ పశు వైద్యులు వాసంతి సిబ్బంది కిరణ్, అభి అటవీ శాఖ అధికారులు హాజరయ్యారు.

## నవజాత శిశువులు, చిన్నపిల్లల వైద్యంలో ఆధునిక చికిత్సా విధానాలు

శిశువులను కాపాడడంలో పిడియాట్రీషియన్లు కీలకపాత్ర.
పిడియాట్రిక్ వైద్య సదస్సులో 400కిపైగా వైద్యులు హాజరు.






**క్రైమ్ కౌంటర్ న్యూస్...** విజయవాడ:- పుట్టిన శిశువు(నవజాత శిశువు)లను కాపాడడంలో వైద్యుల పాత్ర అమోఘమని అను హాస్పటల్స్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ గాజుల రమేష్ అన్నారు. ఆదివారంనాడు ఎనికేపాడులోని అను మైబేబీలో జరిగిన పిడియాట్రిక్ వైద్య సదస్సుకు రాష్ట్రం నలుమూలలు నుండి 400 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి అను మైబేబీ మరియు ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ సౌజన్యంతో జరిగిన వైద్య సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గాజుల రమేష్ మాట్లాడుతూ, నవజాత శిశువుల వైద్యంలో ఎన్నో ఆధునిక మార్పులు సంభవించాయని, సకాలంలో నిపుణులైన వైద్యులను సంప్రదించడం ద్వారా శిశు మరణాలు తగ్గించవచ్చని పేర్కొన్నారు. నేడు వైద్యరంగంలో పెనుమార్పులు సంభవించి ఆధునిక చికిత్సలు అందించడంలో పిడియాట్రీషియన్స్ పాత్ర కీలకంగా మారిందన్నారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులచే వర్క్‌షాప్ నిర్వహణ, ప్యానెల్ వైద్యులచే గ్రూపు డిస్కర్షన్స్ నిర్వహించారు. సదస్సులో పెద్దఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అను మైబేబీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీదేవి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, డైరెక్టర్ కె.రవికుమార్, పిడియాట్రిక్ వైద్య బృందం డాక్టర్ బి.రేవంత్, డాక్టర్ ఎం.ఎన్.శ్వేత, డాక్టర్ గోవిందరాజులు, డాక్టర్ జోత్స్న ముత్యాల, డాక్టర్ పవన్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు...

# మట్టిని మింగేస్తున్న తోడేళ్లు..

### చెరువుల్లో, కొండల్లో అక్రమ తవ్వకాలు
### చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం









**క్రైమ్ కౌంటర్ న్యూస్... మార్కాపురం జిల్లా...** తర్లుపాడు.మండలంలోని చెరువులపై అక్రమార్కుల కన్ను పడింది. ప్రభుత్వ భూములు బరితెగించి యంత్రాలతో యదేచ్ఛగా త్రవ్వకాలు సాగిస్తూ మట్టిని తరలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా నిద్రావస్తలో జరుగుతుండగా, అధికారుల పర్యవేక్షణ కొరవడింది. చెరువులు, కొండలను పిండి చేస్తున్న ఇదేమని ప్రశ్నించే వ్యవస్థ లేదు. కొందరు పలుకుబడితో దర్జాగా తవ్వేసి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ భూముల్లోనూ బరితెగించి పాగా వేసి దందా సాగిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టి కావలసినవారు అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. వ్యవసాయం చేసే రైతులకు ఉచితంగా అనుమతిస్తారు. ఇతర వాణిజ్య, నిర్మాణరంగం, అభివృద్ధి పనులు అవసరాలకు తరలించాలంటే నిర్ణీత రుసుము చెల్లించాల్సి ఉంది. మండల వ్యాప్తంగా అనధికారికంగా తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మరోవైపు ఎవరైనా అధికారికంగా అనుమతి పొందితే రెట్టింపు మట్టిని తరలిస్తున్నారు. కొంతమంది పలుకుబడి ప్రయోగించి పట్టపగలే బరితెగించి మట్టిని తరలిస్తుంటే మరికొందరు రాత్రి వేళల్లో యంత్రాలతో త్రవ్వేసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు.తర్లుపాడు మండలంలోని కేతగుడిపి చెరువులో ఆదివారం మట్టి మాఫియా దందా కొనసాగుతోంది. పట్టపగలే బరితెగించి ఎక్సికవేటర్లతో త్రవ్వకాలు చేపట్టి, ట్రిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ చెరువు మార్కాపురం నూతన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉండటం గమనార్హం. మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించడంతో చుట్టుపక్కల భూములకు అమాంతం రెక్కలు వచ్చాయి. ఎటువైపు చూసిన వెంచర్లు ఉద్భవిస్తున్నాయి. ఈ వెంచర్లు వేయాలంటే భూమి లోతట్టు ప్రాంతంలో ఉండటంతో మట్టి భారీగా అవసరమవుతుంది. దీంతో రియల్టర్లు, భూ యజమానులు మట్టిని భారీ ధరలు వెచ్చించేందుకు వెనుకాడటం లేదు. దీంతో కొందరు అక్రమ భూ బకాసురులు ప్రభుత్వ భూములను, చెరువులను, కొండలను తోడేళ్లు లాగా మింగేస్తూ, అనధికారంగా పట్టపగలే విచ్చలవిడిగా త్రవ్వకాలు చేపట్టి అధిక ధరలకు విక్రయిస్తూ లక్షలు ఆర్జిస్తున్నారు. ఆదివారం అధికారిక సెలవు దినం కావడంతో ఇష్టానుసారంగా యంత్రాలతో త్రవ్వకాలు చేపట్టి, పది ట్రిప్పర్లతో మట్టిని రవాణా చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన కొందరు గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు సమాచారం. ఈ చెరువు నుండి జిల్లా కేంద్రానికి యదేచ్ఛగా మట్టి రవాణా చేస్తున్న ఇదేమిటని ప్రశ్నించే అధికారే కరువయ్యారు. ఇక్కడే కాకుండా మండల వ్యాప్తంగా చాలాచోట్ల దోపిడి పర్వం నిర్విఘ్నంగా సాగుతూనే ఉంది. రెవెన్యూ, జల వనరులు,భూగర్భ ఘనులు, విజిలెన్స్, పోలీస్ శాఖల మధ్య సమన్వయం కొరవడింది. గ్రామీణులు సమాచారం అందించిన సకాలంలో స్పందించడం లేదు. అక్రమ భాగవతంపై కొన్నిసార్లు పత్రికలో కథనాలొస్తే, ప్రసారమాధ్యమాల్లో ప్రసారమైతే, బలమైన వ్యక్తులు, కొందరు అధికారులకు ముడుపులు చెల్లించి అదుపులోకి తీసుకున్న వాహనాలను సైతం విడిచిపెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని నిబంధనలను చెబుతున్నా రాజకీయ ఒత్తిళ్ళతో రానున్న రోజుల్లో అక్రమాలు చేపట్టరాదని సున్నితంగా హెచ్చరించి పంపిస్తున్నారే తప్ప కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను,రవాణాను అడ్డుకోవాలని, మట్టిని మింగేస్తూ లక్షలు తోడేళ్లను కఠినంగా శిక్షంచాలని, ప్రభుత్వ భూములను, చెరువులను, కొండలను, పరిరక్షంచాలని మండల ప్రజలు కోరుతున్నారు....

## పండగ తర్వాత మన జిల్లాలోనూ రెవెన్యూ క్లినిక్‌లు

**క్రైం కౌంటర్ న్యూస్ :** చిత్తూరు కలెక్టరేట్, జనవరి 4 భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంక్రాంతి పండగ తర్వాత మన జిల్లాలోనూ రెవెన్యూ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే అమలవుతున్న పీజీఆర్ఎ?అబశ్రీశ్రీస(ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు అనుబంధంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం విధి విధానాలను సూచిస్తూ సీసీఎల్ఏ ఆదేశాలు జారీ చేసింది.

రికార్డులతో సిద్ధం

క్లినిక్‌లో తహసీల్దార్లు, ఆర్డీవోలు, సిబ్బందితోపాటు అడంగళ్, 10–1 ఖాతాలు, ఎస్ఎ?అబశ్రీశ్రీఫఎ(సెటిల్‌మెంట్ ఫెయిర్ అడంగల్), వెబ్‌ల్యాండ్, ఓఆర్‌సీఎంఎస్, తదితర రికార్డులు అందుబాటులో ఉంటాయి.

రిసెప్షన్

ప్రతి రెవెన్యూ క్లినిక్‌లోనూ రిసెప్షన్ ఉంటుంది. అర్జీదారుడిని కౌంటర్‌కు పిలిచి అతడినుంచి ప్రాథమిక వివరాలు, పత్రాలు తీసుకుంటారు. వాటిని నిర్దేశిత ఫార్మేట్‌లో నమోదు చేస్తారు.

సమస్యల వారీగా వర్గీకరణ ఆర్‌వోఆర్, పట్టాదార్ పాసుపుస్తకం, ఆర్‌వోఎ?అబశ్రీశ్రీఫఆర్, వన్–70 సంబంధించినవి, రీ సర్వే, ఇలాంటివి మొత్తం 14 రకాల సమస్యలుగా అర్జీలను వర్గీకరిస్తారు. వాటికి అనుగుణంగా 14 టేబుళ్లు, సిబ్బందిని ఏర్పాటు చేస్తారు. సమస్య ఏ విభాగానికి సంబంధించిందో గుర్తించి అర్జీదారులను ఆ టేబుల్ వద్దకు పంపిస్తారు. తహసీల్దార్‌తో మాట్లాడొచ్చు అర్జీదారుడి నుంచి వివరాలు తీసుకున్నాక తహసీల్దార్‌తో మాట్లాడిస్తారు. సివిల్ వివాదాలైతే కోర్టుకెళ్లాలని సూచిస్తారు. తహసీల్దార్ కూడా వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్లతో మాట్లాడి సమాచారం తీసుకుంటారు. పరిష్కారం దొరక్కపోతే క్షేత్రస్థాయికి..

సాధ్యమైనంత వరకు రెవెన్యూ క్లినిక్‌లలో అధికారుల వద్ద ఉండే ఫైళ్ల ఆధారంగా సమస్యను పరిష్కరిస్తారు. అలా పరిష్కరించలేనప్పుడే క్షేత్రస్థాయి విచారణకు ఆదేశిస్తారు. ఈ విషయాన్ని ఏటీటీ (యాక్షన్ టేకన్ రిపోర్టు)లో నమోదు చేస్తారు. వీఆర్వో, సర్వేయర్, ఆర్ఐ అందుకు అనుగుణంగా విచారణ లేదా సర్వేచేసి ఫొటోలు తీసి నివేదికలను సమర్పిస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఆర్‌వోఆర్ కేసుల్లో అప్పీల్ అవసరమైతే తహసీల్దార్, ఆర్డీవోలు స్పందిస్తారు. ఓఆర్‌సీఎంఎస్ ద్వారా అప్పీల్‌చేసి సంబంధిత పక్షలకు నోటీసు ఇస్తారు. మ్యుటేషన్, ఎఫ్ఎంసీ, వన్‌బీ తదితర సేవలైతే సేవాకౌంటర్‌కు అర్జీదారుడిని పంపి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తారు. రెవెన్యూ క్లినిక్ ఏటీటీ జత చేస్తారు.

తొలుత చిత్తూరులో..

రెవెన్యూ క్లినిక్‌లను చిత్తూరుతోపాటు మిగిలిన రెవెన్యూ డివిజన్లలో ఏర్పాట్లు చేస్తారు. ప్రస్తుతం కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ఈనెల తొమ్మిదో తేదీవరకు కొనసాగుతున్న దృష్ట్యా రెవెన్యూ సిబ్బంది పూర్తిగా ఇందులో నిమగ్నమై ఉన్నారు. సంక్రాంతి తర్వాత జిల్లా కేంద్రంలో ప్రయోగాత్మకంగా ఏడెనిమిది మండలాలతో కలిపి కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ఏర్పాట్లు చేస్తారు. ఆ తర్వాత మిగిలిన రెవెన్యూ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నారు.

## భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



**క్రైం కౌంటర్ న్యూస్ :** భారతదేశం క్రీడా రంగంలో సరికొత్త శిఖరాలను అధిరోహించే దిశగా అడుగులు వేస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వారణాసిలో 72వ జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న ఆయన.. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్ భవిష్యత్తులో చేపట్టబోయే మెగా స్పోర్ట్స్ ఈవెంట్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు.2036 ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడమే లక్ష్యంగా భారత్ ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్ హక్కులను దక్కించుకోవడానికి ఎక్కడా రాజీపడకుండా కృషి చేస్తున్నామన్నారు. అలాగే, 2030 కామన్వెల్త్ గేమ్స్ కూడా భారత్‌లోనే జరగనున్నాయని మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడంలో భారత్ తన సత్తాను చాటుతోందని, గత దశాబ్ద కాలంలో అండర్–17 ఫిఫా వరల్డ్ కప్, హాకీ వరల్డ్ కప్, చెస్ టోర్నమెంట్లతో సహా 20కి పైగా అంతర్జాతీయ ఈవెంట్లను మన దేశం విజయవంతంగా నిర్వహించిందని గుర్తు చేశారు.వాలీబాల్ క్రీడ గొప్పతనాన్ని వివరిస్తూ ఇది కేవలం ఆట మాత్రమే కాదని, సహకారం, సమతుల్యత కూడిన ప్రక్రియ అని మోదీ అభివర్ణించారు. బంతిని కింద పడకుండా గాలిలోనే ఉంచేందుకు చేసే ప్రయత్నంలో క్రీడాకారుల పట్టుదల కనిపిస్తుందన్నారు. ఃటీమ్ ఫస్ట్ః అనే నినాదంతో ప్రతి క్రీడాకారుడు జట్టు విజయం కోసమే ఆడాలని సూచించారు. వ్యక్తిగత నైపుణ్యాలు వేరైనా, సమష్టి కృషితోనే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.జనవరి 4 నుంచి 11 వరకు జరగనున్న ఈ 72వ జాతీయ వాలీబాల్ టోర్నీలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, సంస్థల నుంచి 58 జట్లు పాల్గొంటున్నాయి. సుమారు 1,000 మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ టోర్నీ ద్వారా భారతీయ వాలీబాల్‌లో ఉన్న అత్యుత్తమ ప్రమాణాలు, క్రీడాస్ఫూర్తి వెలుగులోకి వస్తాయని నిర్వాహకులు ఆశిస్తున్నారు.

# సినిమా



## వాళ్లలాగా చెయ్యమని నన్ను బలవంతం చేసేవారు.

సౌత్ ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్లలో మీనా ఒకరు. చైల్డ్ ఆర్టిస్టుగా తెరంగేట్రం చేసి ఆ తర్వాత కథానాయికగా మెప్పించింది. మెగాస్టార్ చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ, రజినీకాంత్ వంటి స్టార్ హీరోలతో బ్లాక్ బస్టర్ హిట్స్ చేసింది. దశాబ్దాలపాటు ఇండస్ట్రీని శాసించింది. ఇప్పటికీ సహాయ నటిగా ప్రేక్షకులను అలరిస్తుంది. ఈ క్రమంలోనే ఓ ఇంటర్వ్యూలో మీనా మాట్లాడుతూ తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఒకప్పుడు గ్లామర్ పాత్రలకు ప్రాధాన్యతనిచ్చి, అటువంటి పాత్రలు చేయలేదని బాధపడినట్లు తెలిపారు. అయితే పాత్రల ఎంపిక, నటనకు ప్రాధాన్యత ఇవ్వడం తన కెరీర్‌ను మరింత అందంగా మార్చిందని అన్నారు. అలాగే అందరూ హీరోయిన్ల మాదిరిగానే తనను కూడా గ్లామర్ రూల్స్ చేయాలని బలవంతం చేశారని చెప్పుకొచ్చింది.నటి మీనా మాట్లాడుతూ.. ఒకప్పుడు తాను కూడా గ్లామర్ పాత్రలు చేస్తే మరింత గుర్తింపు వస్తుందేమోనని భావించినట్లు తెలిపారు. ఒకప్పుడు గ్లామర్ పాత్రలు చేసే నటీమణులకు లభించే ప్రాధాన్యత, గుర్తింపు చూసి, తాను కూడా అలాంటి పాత్రలు చేయాలనుకున్నానని మీనా తెలిపారు. "నేను కూడా హీరోయిన్నే కదా, వాళ్లకంటే సీనియర్‌ని. నాకెందుకు ఈ గుర్తింపు దొరకడం లేదు?" అని భావించి, అప్పుడు తన తల్లి వద్ద బాధపడిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదని, తన పాత్రల ఎంపిక, వైవిధ్యభరితమైన క్యారెక్టర్లు తన కెరీర్‌ను నిలబెట్టాయని ఆమె అన్నారు. ముఖ్యంగా రోజాతో ఒకరికొకరం పోటీపడేవారమని, ఒకరు చేయని సినిమాను మరొకరు చేసేవారమని, "మీనా-రోజా, రోజా-మీనా" అన్నట్లు ఉండేదని ఆమె గుర్తుచేసుకున్నారు.గ్లామర్ పాత్రల ఒత్తిడి గురించి అడగగా, కెరీర్ ప్రారంభంలో పెద్దగా లేకపోయినా, తర్వాత "మీరు కూడా చేయాలి, చేస్తే తప్పు లేదు" అని చాలా మంది ప్రయత్నించారని మీనా అన్నారు. తాను కూడా ప్రయత్నించాలని అనుకొని, ప్రభుదేవా సినిమా కోసం ఒకసారి స్విమ్‌సూట్‌లో నటించానని తెలిపారు. అయితే, ఆ డ్రెస్ వేసుకున్న వెంటనే తాను చాలా అసౌకర్యంగా భావించానని, మేకప్ రూమ్ నుండి బయటకు రావడానికి కూడా ఇబ్బంది పడ్డానని చెప్పారు. "ఈ హీరోయిన్స్ అందరూ ఎలా చేస్తున్నారురా బాబూ" అని నిజంగానే ఆశ్చర్యపోయానని అన్నారు. కమిట్‌మెంట్ ఇచ్చాను కాబట్టి చేశానని, అది తన కెరీర్‌లో ఒక్కసారి మాత్రమే జరిగిందని మీనా స్పష్టం చేశారు.





## కొబ్బరినీరు మంచిదే కానీ.. వీరికి మాత్రం డేంజర్! అస్సలు తాగొద్దు

కొబ్బరినీరు అనేది సహజమైన సూపర్ ఎనర్జీ డ్రింక్‌గా చెబుతారు. ఆరోగ్యంగా ఉన్నవారైనా, అనారోగ్యంతో ఉన్నవారైనా కొబ్బరి నీరు తాగవచ్చని అంటారు. ఇందులో ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. డీహైడ్రేషన్‌ను నివారించడంలో ఇది సహాయపడుతుంది. ఇందులో కేలరీలు కూడా తక్కువగా ఉంటాయి. కొబ్బరినీరు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడంతోపాటు జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. ఇలాంటి అనేక ప్రయోజనాలు ఉన్న కొబ్బరినీటిని కొందరు మాత్రం తీసుకోకపోవడమే మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాంటి వారు కొబ్బరి నీరు తీసుకుంటే ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.మధుమేహ వ్యాధిగ్రస్తులు

కొబ్బరి నీటిలో నీటిలో సహజ చక్కెర ఉంటుంది (200 మి.లీ.కి దాదాపు 6-7 గ్రాములు). ఇది ఇతర శీతల పానీయాల కంటే తక్కువగా ఉన్నప్పటికీ.. ఇది మధుమేహం ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. అందుకే, డాక్టర్ నిర్దేశించిన విధంగా మాత్రమే తీసుకోవాలి.

మూత్రపిండాల వ్యాధి బాధితులు

మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి కొబ్బరి నీరు ప్రమాదకరమనే చెప్పాలి. ఎందుకంటే.. ఇందులో అధిక స్థాయిలో పొటాషియం ఉంటుంది. మూత్రపిండాలు ఈ పొటాషియాన్ని ఫిల్టర్ చేయలేనప్పుడు.. రక్తంలో పొటాషియం స్థాయిలు పెరిగే 'హైపర్‌కలేమియా' అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇది హృదయ స్పందన రేటులో మార్పులు, కండరాల బలహీనతకు కారణమవుతుంది.

అలెర్జీ సమస్యలు ఉన్న వ్యక్తులు

కొబ్బరి నీరు లేదా కొబ్బరి సంబంధిత ఉత్పత్తులను తినేటప్పుడు అలెర్జీలు ఎదుర్కొనే వ్యక్తులు కొబ్బరి నీళ్ళకు దూరంగా ఉండాలి. వీరు కొబ్బరి నీరు తీసుకోవడం వల్ల దురద, చర్మంపై ఎర్రటి మచ్చలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఎదుర్కోవచ్చు.

జలుబు, జ్వరం బాధితులు

ఆయుర్వేదం ప్రకారం.. కొబ్బరి నీళ్ళు శరీరాన్ని చల్లబరుస్తాయి. అందువల్ల, జలుబు, దగ్గు లేదా గొంతు నొప్పి ఉన్నసమయంలో కొబ్బరి నీళ్ళు తాగడం వల్ల కఫం పెరుగుతుంది. దీంతో వారికి వ్యాధి నయం కావడం ఆలస్యం అవుతుంది.

బీపీ బాధితులు

కొబ్బరి నీళ్లలోని పొటాషియం రక్తపోటును తగ్గించడంలో సహాయపడినప్పటికీ.. బీపీ మందులు వాడేవారు జాగ్రత్తగా ఉండాలి. బీపీ మాత్రలతో పాటు కొబ్బరి నీళు తాగడం వల్ల శరీరంలో అధిక పొటాషియం స్థాయిలు ఏర్పడతాయి. ఇతర సమస్యలకు దారితీయవచ్చు.

ఎలక్ట్రోలైట్-నిరోధిత ఆహారం పాటించేవారు

వైద్యుల సలహాతో గుండె జబ్బులు లేదా ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా పొటాషియం, సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుకునేవారు కూడా కొబ్బరినీరుకు దూరంగా ఉండాలి. లేదంటే కొబ్బరి నీరు వారి శరీరంలోని లవణాల సమతుల్యతను దెబ్బతీస్తుంది. వారి ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఏర్పడవచ్చు. అందుకే ఇలాంటి మాత్రం కొబ్బరినీరును వైద్యుల సూచించిన మేరకు తీసుకోవడం లేదా? మానేయడం చేస్తే మంచిది.



## ఇదేం చేస్తుందిలే అనుకునేరు..

కీర దోసకాయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీనిని తరచుగా సలాడ్లలో, రైతాలలో లేదా జ్యూస్‌లా తీసుకుంటూ ఉంటారు. ఇందులో దాదాపు 95 శాతం నీరు ఉండటం వల్ల ఇది శరీరానికి హైడ్రేషన్ అందిస్తుంది. బరువు తగ్గడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి కీరదోస అద్భుతంగా పనిచేస్తుంది. అంతేకాకుండా, విటమిన్ కె, విటమిన్ సి, పొటాషియం లాంటి ముఖ్యమైన పోషకాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. అయితే, ఈ పోషక ప్రయోజనాలతో పాటు, కొందరికి కీర దోసకాయ ఆరోగ్య సమస్యలను తీవ్రతరం చేయవచ్చని ప్రముఖ న్యూట్రిషనిస్ట్ శ్వేతా షా తెలిపింది.ఆయుర్వేదం ప్రకారం.. కీర దోసకాయ తింటే చలవ చేస్తుందని అంటారు. శరీరంలో చల్లదనం వల్ల వచ్చే సమస్యలతో బాధపడేవారు దీనిని అస్సలు తినకూడదు. ముఖ్యంగా ఆస్తమా, జలుబు, దగ్గు, శ్లేష్మం, సైనస్ లేదా ఉబ్బసం లాంటి సమస్యలున్నవారు పూర్తిగా పక్కకు పెట్టాలి. అలాగే కీరదోస ఎక్కువగా తీసుకోవడం వల్ల వాతాన్ని పెంచుతుంది. ఇప్పటికే కీళ్ల నొప్పులు లేదా శరీరంలో వాపుతో బాధపడేవారు కీరదోసకు దూరంగా ఉండటం మంచిది. కీర దోసకాయలో ఫైబర్ అధికంగా ఉన్నప్పటికీ, సెన్సిటివ్ జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఇది కొన్ని ఇబ్బందులను కలిగించవచ్చు. ఇందులో ఉండే కుకుర్బిటాసిన్ అనే సమ్మేళనం వల్ల ఇరిటబుల్ బౌల్ సిండ్రోమ్(×దీూ) లాంటి జీర్ణ సమస్యలున్నవారికి గ్యాస్, ఉబ్బరం లేదా అజీర్ణం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. కీర దోసకాయలో అధిక నీటి శాతం ఉండటం వల్ల మూత్ర విసర్జన సమస్యలతో బాధపడేవారు దీనిని ఎక్కువగా తీసుకుంటే తరచుగా మూత్ర విసర్జన అవసరమై అసౌకర్యానికి గురికావచ్చు. డయాబెటిస్ రోగులకు కీరదోసకాయలు సాధారణంగా సురక్షతమైనవిగా పరిగణిస్తారు. అయితే, కీరదోసకాయ గింజలు ఇన్సులిన్ లేదా గ్లూకోజ్ తగ్గించే మందులు తీసుకునేవారిలో సమస్యలను సృష్టించవచ్చు. పెద్ద మొత్తంలో గింజలు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా తగ్గి, వణుకు, తలతిరగడం లాంటివి వస్తాయి. నిపుణులు తరచుగా రాత్రి భోజనం తర్వాత కీరదోస తినకూడదని సలహా ఇస్తారు. ఇది జీర్ణం కావడానికి సమయం పడుతుంది. దాని అధిక నీటి శాతం నిద్రకు భంగం కలిగించవచ్చునని చెబుతుంటారు.

## 4 నెలలైనా భారత్‌కు అందని ఆసియా కప్..

సెప్టెంబర్ 28, 2025న జరిగిన ఏషియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, పాకిస్థాన్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఘనవిజయం సాధించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో టీమ్ ఇండియా ఈ టోర్నమెంట్‌లో పాకిస్థాన్‌ను వరుసగా మూడుసార్లు ఓడించి చిత్తు చేసింది. అయితే, ఈ విజయం సాధించి మూడు నెలలు గడిచినా టీమ్ ఇండియాకు మాత్రం విన్నింగ్ ట్రోఫీ అందలేదు. సాధారణంగా టోర్నమెంట్ గెలిచిన వెంటనే విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తారు. కానీ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటివరకు ఆ ట్రోఫీని భారత్‌కు ఇవ్వలేదు.భారత్‌కు ట్రోఫీ ఇవ్వని మొహ్సిన్ నఖ్వీ..

ఆసియా కప్ చరిత్రలో ఏ జట్టు గెలిచినా ఆ రోజే అధికారికంగా ట్రోఫీని అందజేయడం ఆనవాయితీ. కానీ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు, ఏసీసీ అధ్యక్షుడు, పాకిస్థాన్ హెూం మంత్రిగా ఉన్న మొహ్సిన్ నఖ్వీ హయాంలో ఆసియా క్రికెట్ కౌన్సిల్ చరిత్రలో ఇదొక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది. ఆసియాలోనే అత్యంత బలమైన జట్టుగా భారత్ గెలిచినప్పటికీ, నఖ్వీ ట్రోఫీని అందజేయకపోవడం చర్చనీయాంశంగా మారింది.



## ఈ ముగ్గురు ఆటగాళ్లకు అర్హతే లేదు.

జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభం కానున్న మూడు వన్డేల సిరీస్ కోసం సెలెక్టర్లు జనవరి 3న భారత జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఈ సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా నియమించాడు. గిల్ ప్రస్తుతం ప్లీహము గాయం నుంచి కోలుకుంటున్నాడు. అయితే అతని పేరు పక్కన 'స్టార్‌ణ గుర్తు ఉంది. అంటే బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి అతనికి ఇంకా గ్రీన్ సిగ్నల్ లభించలేదని అర్థం. వైద్య బృందం అనుమతి ఇస్తేనే ఆయన మైదానంలోకి దిగుతాడు. అయితే, ఈ జట్టులో ఎంపికైన ముగ్గురు ఆటగాళ్లపై తీవ్ర చర్చ జరుగుతోంది. వారి ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉన్నా, కేవలం కోచ్ గౌతమ్ గంభీర్ చొరవతోనే వారికి చోటు దక్కిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ముగ్గురు ఆటగాళ్లు ఎవరో ఓసారి చూద్దాం..

1. రిషబ్ పంత్: లెఫ్ట్ హ్యాండ్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను సెలెక్టర్లు వన్డే జట్టులోకి తీసుకున్నారు. అయితే, 2025 సంవత్సరంలో పంత్‌కు ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. ఏడాది పొడవునా అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. ప్రస్తుత విజయ్ హజారే ట్రోఫీ (2025-26)లో కూడా పంత్ పెద్దగా ప్రభావం చూపలేదు. 5 మ్యాచ్‌ల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలతో 188 పరుగులు మాత్రమే చేశాడు. అదే సమయంలో ధ్రువ్ జురెల్ (379 పరుగులు), ఇషాన్ కిషన్ (2 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీతో 146 పరుగులు) అద్భుతంగా రాణిస్తున్నా బీసీసీఐ వారిని విస్మరించింది.
2. నితీష్ కుమార్ రెడ్డి: యువ ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డికి కూడా జట్టులో చోటు దక్కింది. కానీ అతని గత గణాంకాలు ఏమాత్రం ఆకట్టుకునేలా లేవు. ఇప్పటివరకు ఆడిన రెండు వన్డేల్లో నితీష్ కేవలం 27 పరుగులు మాత్రమే చేశాడు. బౌలింగ్‌లో ఒక్క వికెట్ కూడా తీయలేదు. అతని ఎకానమీ రేటు కూడా 7.74 గా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో కూడా 5 మ్యాచ్‌ల్లో ఒకే ఒక్క అర్ధ సెంచరీ, 6 వికెట్లు మాత్రమే తీశాడు. అయినప్పటికీ సెలెక్టర్లు అతనికి వన్డే క్యాప్ ఇచ్చేందుకు మొగ్గు చూపారు.
3. ప్రసిద్ధ్ కృష్ణ: ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణపై కోచ్ గంభీర్ ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు కనిపిస్తోంది. ప్రసిద్ధ్ ఇప్పటివరకు 21 వన్డేల్లో 37 వికెట్లు తీశాడు. అతని ఎకానమీ రేటు 6.02 గా ఉంది. విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటక తరపున కేవలం రెండు మ్యాచ్‌లు ఆడి ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. మరోవైపు, ఇదే టోర్నమెంట్‌లో 5 మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి ఫామ్‌లో ఉన్న మొహమ్మద్ షమీని సెలెక్టర్లు పక్కన పెట్టి ప్రసిద్ధ్‌ను ఎంచుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్)లి, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, మొహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, అర్ష్‌దీప్ సింగ్, యశస్వి జైస్వాల్.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com